సాక్షి కృష్ణాజిల్లా

శనివారం । 15 । మార్చి । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ నిత్యాన్నదానానికి విశాఖపట్నం గాజువాకకు చెందిన సోపల్లి నారాయణ శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



తిరుపతమ్మవారి సన్నిధిలో..

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారిని శుక్రవారం విజయవాడ సీనియర్ సివిల్ జడ్జి సి.రమణారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహరి (ఆది)
విజయవాడ	6.23	4.58
మచిలీపట్నం	6.21	4.56

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన కృష్ణా వర్సిటీ ఉపకులపతి రాంజీ



కోనేరుసెంటర్: రాష్ట్ర గవర్నర్, కృష్ణా విశ్వవిద్యాలయం చాన్సలర్ అబ్దుల్ నజీర్‌ను ఉపకులపతి ఆచార్య కె.రాంజీ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సదరు అంశాలకు సంబంధించిన పనులు చేపట్టడానికి ప్రభుత్వం నుంచి అనుమతి పొందారు. అనంతరం అబ్దుల్ నజీర్‌కు వీసీ శాలువా కప్పి సత్కరించి మొక్కను బహూకరించారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు శుక్రవారం తెలిపారు. జెడ్పీ సమావేశ హాల్లో ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి, 12 గంటలకు విద్య, వైద్య స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరుగుతాయన్నారు. 11 గంటలకు వైస్‌చైర్మన్ గరికిపాటి శ్రీదేవి అధ్యక్షతన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశం, మధ్యాహ్నం ఒంటి గంటకు ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యురాలు దుట్టా సీతారామలక్ష్మి అధ్యక్షతన స్త్రీ, శిశు సంక్షేమం, 2 గంటలకు వైస్‌చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అధ్యక్షతన సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన పనులు, ఆర్థిక సమావేశాలు నిర్వహిస్తారని సీఈవో తెలిపారు. ఉమ్మడి జిల్లా అధికారులు శాఖాపరంగా పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

కనులపండువగా వేణుగోపాలుని తిరుకల్యాణం



తిరువూరు: నెమలి శ్రీవేణుగోపాలస్వామి తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగవైభవంగా జరిగింది. పెళ్లి కుమారుడైన వేణుగోపాలుడిని సంప్రదాయబద్ధంగా గరుడ వాహనంపై ఉంచి మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపైకి తోడ్కొని వచ్చారు. పెళ్లి కుమార్తెలైన శ్రీదేవి, సత్యభామలను పల్లకీలో తీసుకువచ్చారు. వేలాది మంది భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని చూసి తరించేందుకు వచ్చిన భక్తులతో శుక్రవారం ఉదయం నుంచి ఆలయం కిటకిటలాడింది. కల్యాణోత్సవం అనంతరం గరుడవాహనంపై స్వామివారిని, దేవేరులను ఆలయ ప్రవేశం చేయించారు. భక్తుల కోలాట నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. విజయవాడ ఎంపీ చిన్ని దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. 260 మంది దంపతులు పీటలపై కూర్చున్నారు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాంచారమ్మ జాతర



పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅద్దంకి నాంచారమ్మవారి ఆలయ వార్షిక జాతర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రాత్రి గుడి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి-భరతనాట్యం, భక్త చింతామణి, బాల నాగమ్మ నాటకం, సినీగాయని శ్రావణ భార్గవి, రవి మెలోడీస్ ఆర్కెస్ట్రా, అఘోరా వేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, మిమిక్రీ షో, మ్యాజిక్ షో, మురళీ కోలాటాలు నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గురుప్రసాద్, ఆలయ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హోలీ... ఫుల్ జోష్



రంగుల పండుగను పిన్న, పెద్ద ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఆటపాటలు, ఆధ్యాత్మిక మేళవింపుతో శుక్రవారం ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగను ఘనంగా చేసుకున్నారు. వివిధ వర్ణాలతో మెరుస్తూ ఆటపాటలతో తుళ్లుతూ హోలీ ఆడారు. అందరూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. చిన్నారులు గన్‌లో రంగునీళ్లను నింపుకొని సందడి చేశారు. హోలీ తమ జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని కోరుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





వినియోగదారుడు లేకపోతే సంస్థలే లేవు. ఈ సున్నిత అంశాన్ని సంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. నాణ్యమైన వస్తువులు, సేవలను అందించడంలో మభ్యపెడుతున్నాయి. తూకం, నాణ్యత, సేవల్లో ప్రజలను కుడి ఎడమల దగా చేస్తున్నాయి. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన లేమి కారణంగా మోసాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వీటిపై అవగాహన పెంచుకుంటే మోసాలకు చెక్ పెట్టవచ్చని కన్స్యూమర్ ఫోరం సభ్యులు అంటున్నారు.

అన్నింటా మోసం.. అవగాహన లోపం...

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

- కుడి ఎడమల దగా...దగా...!
- ఉమ్మడి కృష్ణాలో నాణ్యత, తూకం, సేవల్లో ప్రజలకు మోసం
- వినియోగదారులకు అండగా కన్స్యూమర్ రైట్స్
- కృష్ణాలో 683 కేసులు, ఎన్టీఆర్ జిల్లాలో 255 కేసులు
- ఇంకా అవగాహన లేమే..
- నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)/చిలకలపూడి (మచిలీపట్నం): మాయా ప్రపంచంలో వినియోగదారుడు తరచూ మోసాల బారిన పడుతూనే ఉన్నాడు. వ్యాపారుల మోసాలకు ఆర్థిక నష్టమే కాకుండా, కొన్ని సందర్భాల్లో ఆరోగ్యాన్ని కూడా వినియోగదారులు కోల్పోతూ ఉంటారు. వ్యాపారుల మోసాలకు చెక్ పెట్టి వినియోగదారుల హక్కులకు గొడుగు పడుతోంది 'వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం'. వీటిపై అవగాహన లేకపోవడంతో మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి.

నాణ్యత ఇతర అంశాలపై..

ఉమ్మడి కృష్ణాలో ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తువుల గ్యారెంటీ లేదా వారంటీ గడువులోపు పని చేయకపోవడం, సంస్థ ఇచ్చిన నిర్ణీత సేవలు సరిగా లేకపోవడం, వస్తు నాణ్యతలో తేడా ఉండటం వంటి అంశాలపై కేసులు నమోదవుతున్నాయి. వాటికి తోడు ఆరోగ్య బీమా సంస్థల సేవలపై అధికంగా కేసులు నమోదవుతున్నాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో రియల్టర్ అనుకున్న సమయానికి ప్లాట్ అందించకపోవడంపై కేసులు నమోదవుతున్నాయి. వాటితో పాటు బ్యాంకింగ్ రంగ అంశాలపై ఉమ్మడి జిల్లాలో కేసులు నమోదవుతున్నట్లుగా ఆయా సంస్థల ప్రతినిధులు వివరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజూ 70 నుంచి వంద కిలోలకు పైగా బంగారం విక్రయాలు జరుగుతున్నాయి. ఉమ్మడి కృష్ణాలో 1,200 నుంచి 1,500 వరకూ బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలు పని చేస్తున్నాయి. వీటికి సంబంధించి బంగారం నాణ్యత, తూకంలో చాలా మోసాలు చోటు చేసుకుంటున్నట్లు ఆ రంగంలోని వ్యక్తులు వివరిస్తున్నారు. ఐరన్ తూకంలోనూ, ఆహార విషయంలోనూ మోసాలు జరుగుతున్నట్లు సంబంధిత రంగ నిపుణులు చెబుతున్నారు.

ఏ అంశాలపై చట్టంతో ప్రయోజనం పొందొచ్చంటే..

ఆర్థికంగా ప్రతిఫలం చెల్లించి ఏవస్తువునైనా కొనుగోలు చేసిన వ్యక్తి వినియోగదారుడిగా పరిగణించబడతాడు. ఏ సేవలకైనా ప్రతి ఫలాన్ని చెల్లించినా, లేదా ఉపయోగించినా ఈ చట్టం వర్తిస్తుంది. వస్తువును తిరిగి అమ్మకాలు చేసే ఉద్దేశంతో కొనుగోలు చేసిన వ్యక్తిని వినియోగదారుడిగా పరిగణించరు.

ఈ అంశాలపై ఫిర్యాదు చేయొచ్చు



ఆహారం, ఎలక్ట్రానిక్స్, మందులు, సౌందర్య సాధనాలు, ఆర్థికరంగంలో బ్యాంకింగ్ సర్వీసులైన డీడీలు ఇవ్వడం, చెక్కులు మార్చుకోవడం తదితర విధుల్లో జాప్యం జరిగినా, వడ్డీ, లెక్కలు సరిగా లెక్కించకపోయినా తదితర బ్యాంకింగ్ సేవల్లో లోపాలు ఈ చట్ట పరిధిలో ఉన్నాయి. ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు, రియల్‌ఎస్టేట్, స్థానిక సంస్థల నుంచి పొందే రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి సదుపాయాల కల్పనపై చేసిన వాగ్దానాలకు విరుద్ధంగా వ్యవహరించే అంశాలపై పరిహారాన్ని పొందవచ్చు. విద్యాసంస్థల్లో అందించే సేవలు, వైద్యుల నిర్లక్ష్యంపై కారణంగా రోగికి జరిగే కష్టనష్టాలకూ ఈ చట్టం పరిహారాన్ని ఇప్పిస్తుంది. జీవిత బీమా పరిహారం చెల్లింపులో సేవా లోపాలు, రోడ్డు రవాణా, పార్సిళ్లు, సేవలు సక్రమంగా లేకపోవడం, పోస్టల్ జాప్యం తదితర అంశాలు కూడా ఈ చట్ట పరిధిలోకి వస్తాయి. వ్యాపారుల అనుచిత లేదా అక్రమ వ్యాపార పద్ధతులతో జరిగే నష్టం, హాని కలిగిందని భావించినా, సేవల్లో లోపం ఉందని, నిర్ధారిత ధర కంటే ఎక్కువ వసూలు చేసినా, అపాయకరమైన వస్తువులు, సేవలు అమ్మకానికి పెట్టినా కేసు నమోదు చేయవచ్చు.

చర్యలు తీసుకునేవారే లేరు



మార్కెట్లో చేపల తూకంలో మోసాలు బహిరంగంగా జరుగుతున్నా దీనిపై చర్యలు తీసుకునేవారు లేరు. చేపల మార్కెట్లలో కవర్లలో, ట్రేలలో నీళ్లతోపాటు చేపలను తూకం వేసి అమ్ముతున్నారు. చేపల ధరలు కూడా మార్కెట్‌లో ధరల పట్టిక ఉండదు. పట్టిక గురించి ప్రశ్నిస్తే ఎవరూ సమాధానం చెప్పరు. ప్రభుత్వం దృష్టి సారించాలి.

-నాగార్జున, వినియోగదారుడు

సుస్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఏటా మార్చి 15న నిర్వహిస్తారు. వినియోగదారుల హక్కులపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించి అవగాహన కల్పిస్తారు. 2025 సంవత్సరానికి 'సుస్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన' థీమ్‌గా నిర్ణయించి దానిపై ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి



అమ్మకం దారుడికి, వినియోగదారుడికి నష్టం జరగకుండా చూడటమే మా శాఖ ముఖ్య ఉద్దేశం చెప్పారు. నిత్యావసరాలను లూజుగా కొనుగోలు చేసేటప్పుడు తూకం విషయంలో వినియోగదారులు చాలా జాగ్రత్తలు పాటించాలి. వేయింగ్ మిషన్‌పై అనుమానం వస్తే ఆ మిషన్ సీల్‌ను పరిశీలించాలి. పెట్రోల్ బంక్‌లోని మీటర్‌లో జీరో వచ్చిన తర్వాతే పెట్రోల్ కొట్టించుకోవాలి. అవసరమైతే 1967 నంబరులో ఫిర్యాదు చేయొచ్చు. -పి.సుధాకర్, డెప్యూటీ కంట్రోలర్, తూనికల కొలతల శాఖ, ఎన్టీఆర్ జిల్లా

మూడేళ్లలో 683 కేసులు నమోదు



మూడేళ్లలో మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లా వినియోగదారుల ఫోరం-1లో 683 కేసులు నమోదయ్యాయి. అందులో 360 కేసులు పరిష్కరించగా, 323 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా వినియోగదారుల్లో అవగాహన లేమి కారణంగా నష్టపోతున్నారు. – చింతలపూడి కిషోర్‌కుమార్, రిటైర్డ్ న్యాయమూర్తి, అధ్యక్షుడు, జిల్లా కన్స్యూమర్ ఫోరం-1, కృష్ణా జిల్లా

'ఉపాధి'లో నాణ్యత డొల్ల

- కొత్తూరు తాడేపల్లి పంచాయతీలో రూ.1.04 కోట్లతో సిమెంటు రోడ్లకు నిధులు
- సీసీ రోడ్లకు గ్రావెల్‌కు బదులు బురద మట్టి
- మూడు నెలలకే పగుళ్లు



కొత్తూరు ఎస్సీ కాలనీలో గ్రావెల్‌కు బదులు చెరువులో బురద వేసిన దృశ్యం



వేమవరంలో వేసిన సిమెంట్ రోడ్డుకు పగుళ్లు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'ఉపాధి'లో సిమెంట్ రోడ్ల నాణ్యత డొల్లగా మారింది. బరంతుగా బురద మట్టి వేసి మమ అనిపిస్తున్నారు కాంట్రాక్టర్ల ముసుగులోని కూటమి నేతలు. కాసులకు కక్కుర్తిపడి రోడ్ల నిర్మాణాన్ని నాసిరకంగా చేస్తున్నారు. పనులన్నీ నామినేషన్‌పైనే కూటమి నేతలకు కట్టబెట్టారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేశారు. కొత్తూరు తాడేపల్లి పంచాయతీలో నిర్మించిన రోడ్లను ప్రారంభించకుండానే పగుళ్లు ఏర్పడ్డాయి. రోడ్లకు బరంతుతో పాటు, రహదారి, డ్రెయినేజీకి మధ్య గ్యాప్‌లో గ్రావెల్ వాడాల్సి ఉన్నా చెరువులో బురద మట్టిని తెచ్చి వేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రూ.80 కోట్లతో 532 పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కొత్తూరు తాడేపల్లి పంచాయతీకి రూ.1.04 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను గన్నవరం నియోజకవర్గ ప్రజా ప్రతినిధి తన ముఖ్య అనుచరుడికి అప్పజెప్పడంతో, ఆయన ఇష్టారాజ్యంగా పనులను చేశారు.

రోడ్లకు బీటలు

ఇందులో వేమవరం కాలనీలో నాలుగు సీసీ రోడ్లు వేశారు. రెండు సీసీ రోడ్లకు రూ.29.10 లక్షలు, రెండు సిమెంటు రోడ్లకు రూ.22.80 లక్షలతో పనులు చేశారు. కొత్తూరు ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో పనులు పూర్తి చేశారు. ఇప్పటికే రూ.67లక్షలతో పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.34 లక్షల పనులకు సంబంధించి ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ సిమెంటు రోడ్లు ప్రారంభించకుండా పగుళ్లు రావడంపై ఆ గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ బదులుగా చెరువులో బురద వేయడంతో, రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల విషయాన్ని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మొత్తం మీద పల్లె పండుగలో భాగంగా చేపట్టిన సిమెంటు రోడ్లపైన విజిలెన్స్ విచారణ చేస్తే అసలు విషయాలు బయటికి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి నాసిరకం పనులపైన విచారణ చేయాలని కోరుతున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని పరిరక్షించాలి

మాజీ మంత్రి వడ్డే డిమాండ్



ధర్నా చౌక్‌లో నిరసన ధర్నా

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విశాఖ స్టీల్ ప్లాంట్‌ని పరిరక్షించాలని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మిక నాయకులకు రాతపూర్వకంగా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని, అయితే ఆ నిధులు ప్లాంట్‌ని కాపాడుకోవడం కోసమే అనటం విడ్డూరంగా ఉందన్నారు. ప్లాంట్‌ని కాపాడుకోవాలంటే సంస్థకు ప్రభుత్వ అధీనంలోని బొగ్గు, ఇనుము లాంటి గనులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే సంస్థ నిర్వహణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి నేతృత్వంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ చిత్త శుద్ధిని పార్లమెంటు, అసెంబ్లీ తీర్మానం ద్వారా దేశ ప్రజానీకానికి, ప్రత్యేకంగా ఆంధ్ర ప్రజలకు విశ్వాసాన్ని కల్పించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజల బలిదానాలు, నాటి విద్యార్థుల ప్రాణ త్యాగాలతో వచ్చిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడం ఆంధ్ర ప్రజల హక్కు అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోకపోతే భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం అధికారం కోల్పోక తప్పదని హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమ నాయకుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు కేవలం బకాయిపడిన వేతనాలు, సంస్థ నిర్వహణ కోసం మాత్రమే పనికొస్తాయన్నారు. సభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మరీదు ప్రసాద్ బాబు తదితరులు ప్రసంగించారు. సభకు అధ్యక్షవర్గంగా ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సాంబశివరావు వ్యవహరించారు. సీఐటీయూ నాయకులు కమల, టీయూసీఐ నాయకురాలు ఎం.సంధ్య అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు డీఈవో పీవీజే రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు. 10వ తరగతి పరీక్ష కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని డీఈవో సూచించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు వారి పరిధిలోని పాఠశాలలకు తెలియజేయాలని ఆదేశించారు.

వైభవంగా తిరుపతమ్మ చిన్నతిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో తిరుపతమ్మవారు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల పౌర్ణమి శుక్రవారం ఉదయం 6.02 గంటలకు అఖండజ్యోతి స్థాపనతో వైభవంగా ప్రారంభమయ్యాయి. మహాసంప్రోక్షణ అనంతరం ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో తిరునాళ్ల మొదలయ్యాయి. ఆలయ ప్రధానార్చకుడు మర్రెబోయిన గోపిబాబు, అర్చకులు పాపమాంబ వంశీకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జ్యోతి వెలిగించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఆలయ ఈఈ రమ, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఉమాపతి, ఏఈ రాజు, తదితరులు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తుల కోసం దేవస్థానం వద్ద తాత్కాలికంగా పోలీస్ ఔట్‌పోస్టు, హెల్త్ క్యాంప్‌లు, పలు శాఖలకు చెందిన కార్యాలయాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీప కాంతులతో ఆలయం మెరిసిపోతోంది. నందిగామ ఏసీపీ తిలక్ ఆధ్వర్యాన జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తుల సందడి

చిన్న తిరునాళ్లలో మొదటి రోజు పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మునేరులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేశఖండనశాలలో భక్తులు తలనీలాలు తీయించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. మునేరులో నీరు లేక పోవడంతో ఆలయ అధికారులు తాత్కాలికంగా జల్లుస్నానాలు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రమేష్

పెదపారుపూడి: వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని భూషణగుళ్ళ గ్రామానికి చెందిన ఆల రమేష్ నియమితుల య్యారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఈమేరకు ఉత్తర్వులు వచ్చాయని రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కు మార్ తనపై నమ్మకం ఉంచి జిల్లా పదవి ఇప్పించినందుకు రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

వడ్డీతో బీమా మొత్తాన్ని చెల్లించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి వడ్డీతో సహా క్లయిమ్ మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, లక్ష్మీ రాయల శుక్రవారం తీర్పు చెప్పారు. విజయవాడకు చెందిన కె.ప్రసాద్ చోళమండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో కరోనా రక్షక్ హెల్త్ పాలసీని 2020 అక్టోబరు 2వ తేదీ నుంచి 2021 జూన్ 25వ తేదీ వరకు చెల్లుబాటు అయ్యేలా పాలసీ తీసుకున్నారు. అయితే 2021 జూన్ 6వ తేదీన ప్రసాద్‌కు కోవిడ్ పాజిటివ్ అని నిర్ధారణ అయిన మీదట ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. చికిత్సకు హాస్పిటల్‌కు ఖర్చు చేసిన మొత్తం రూ.1.50 లక్షలు తనకు చెల్లించాలని కంపెనీని సంప్రదించగా క్లయిమ్‌ను తిరస్కరించారు. దీంతో ప్రసాద్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించటంతో కమిషన్ సభ్యులు పూర్వాపరాలను విచారించిన అనంతరం 2022 మార్చి 18వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో రూ.1.50 లక్షలు, మానసిక వేదన కలిగించినందుకు రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా ఖాతాదారునికి చెల్లించాలని పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్ కొబ్బరితోట ప్రాంతానికి చెందిన బత్తుల అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బత్తుల చరణ్(17) జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. గురువారం పరీక్ష రాసి వచ్చాడు. శుక్రవారం ఉదయం 8 గంటలకు తల్లిదండ్రులు ఇద్దరూ పనులకు వెళ్లిపోయారు. తమ్ముడు బయటకు వెళ్లి తిరిగి వచ్చే లోపు ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన తమ్ముడు స్థానికులతో కలిసి హుటాహుటిన అన్న చరణ్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వారు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ చరణ్ మృతి చెందాడు. కుమారుడి ఆత్మహత్యతో అప్పారావు కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించింది. అసలు ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియక తల పట్టుకుంటున్నారు. అప్పారావు ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా భవిష్యత్తుతో ఆటలాడొద్దు

- ఈడుపుగల్లులోనే మెడికల్ అకాడమీ కొనసాగించాలి
- అకాడమీ వద్ద విద్యార్థులు, వారికి మద్దతుగా తల్లిదండ్రుల నిరసన



ఈడుపుగల్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ మెడికల్ అకాడమీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కంకిపాడు: కోటి ఆశలతో ఐఐటీ–మెడికల్ అకాడమీలో సీటు దక్కించుకుని విద్యనభ్యసిస్తున్న తమ జీవితాలతో ఆటలాడొద్దని, ఐఐటీ–మెడికల్ అకాడమీ తరలింపుతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చొద్దంటూ విద్యార్థులు గళం విప్పారు. రెండో సంవత్సరం కూడా ఐఐటీ–మెడికల్ అకాడమీని కొనసాగించి తమ బంగారు భవితకు పునాదులు వేయాలని, ఆడ పిల్లల చదువులను నిర్లక్ష్యం చేయొద్దంటూ మొరపెట్టుకున్నారు. ఈడుపుగల్లు గ్రామ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ–మెడికల్ అకాడమీ తరలింపు నేపథ్యంలో విద్యార్థులు, వారికి మద్దతుగా తల్లిదండ్రులు శుక్రవారం అకాడమీ వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి వద్ద నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శనగా అకాడమీ వద్దకు చేరుకుని బైఠాయించారు. పోటీ పరీక్షలు రాసి సీటు దక్కించుకున్నామని, ఐఐటీ–మెడికల్ సీట్లు సాధించాలనే తమ లక్ష్యాన్ని నీరుగార్చొద్దంటూ నినాదాలు చేశారు. ప్రతిభ గల విద్యార్థులను కేవలం భవనం అద్దె సాకుతో నిర్లక్ష్యం పాలుచేయొద్దంటూ ఆవేదన వెలిబుచ్చారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఈ ఏడాది ఐఐటీ నోటిఫికేషన్ నిలుపుదల చేశారని, మొదటి సంవత్సరం చదివిన తమను రెండో సంవత్సరం విద్య కూడా మెడికల్ అకాడమీలోనే పూర్తి చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న మూడు ఐఐటీ అకాడమీల్లో బాలికలకు ప్రత్యేక అకాడమీ ఈడుపుగల్లు ఒక్కటేనని, ఆడపిల్లల చదువును నిర్లక్ష్యం చేయొద్దంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి 2025–26 విద్యా సంవత్సరానికి అకాడమీని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

గురుకులం వద్ద ఉద్రిక్తత

ఐఐటీ–మెడికల్ అకాడమీ వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అర్ధాంతరంగా అకాడమీని తరలించడంతో తమ చదువులు ప్రశ్నార్థకం అవుతాయని, వసతులు లేక ఇబ్బందులు పడే అవకాశం ఉందంటూ నినాదాలు చేశారు. రెండో సంవత్సరం విద్య పూర్తయ్యే వరకూ మెడికల్ అకాడమీని ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న ఉమ్మడి కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ ఎ.మురళీకృష్ణ, అకాడమీ డైరెక్టర్ బ్యూలాతో కలిసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపారు. కుంటముక్కల, ఇతర గురుకులాల్లో మెరుగైన విద్య అందేలా, అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.



ఉమ్మడి కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఫ్యాకల్టీని కూడా పూర్తి స్థాయిలో కుంటముక్కలలో అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. అయితే అద్దె భారం అనుకోకుండా అకాడమీని కొనసాగించి తమ చదువులు, భద్రతకు భరోసా ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్తామని వివరించారు. ఇదే సమయంలో ఎస్ఎఫ్ఐ నేతలు అకాడమీకి చేరుకుని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.సమరం నేతృత్వంలో అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

వాలీబాల్ డెప్యూటీ చీఫ్ రిఫరీగా డానియేల్



డానియేల్‌ను సత్కరిస్తున్న సీడబ్ల్యూఎం శ్రీనివాస్ తదితరులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపునకు చెందిన అంతర్జాతీయ వాలీబాల్ రిఫరీ ఎం.డానియేల్ నేషనల్ డెప్యూటీ చీఫ్ రిఫరీగా ఎంపికయ్యారు. న్యూఢిల్లీకి చెందిన రైల్వే ప్రమోషన్ బోర్డు సభ్యులు తనను డెప్యూటీ చీఫ్ రిఫరీగా ఎంపిక చేసిన ఉత్తర్వులను శుక్రవారం ఆయన అందుకున్నారు. రైల్వే స్పోర్ట్స్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక వాలీబాల్ మ్యాచ్‌లకు రిఫరీగా ఆయన సేవలు అందించినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా వ్యాగన్ వర్క్‌షాపు చీఫ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్, డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఎ.చంద్రశేఖర్, స్పోర్ట్స్ అధికారి హనుమనాయక్, పర్సనల్ అధికారి శైలా సుధాకర్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రహ్మాజీ, కార్యదర్శి దయాకర్ తదితరులు డానియేల్‌ను ఘనంగా సత్కరించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యుత్ కార్మికుడు మృతి



మణికుమార్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: అనుమానాస్పద స్థితిలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎన్టీటీపీఎస్ చన్నీటి కాలువలో పడి ఉన్న మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో స్విచ్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు మణికుమార్ బుధవారం నుంచి కనిపించడంలేదు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఎన్టీటీపీఎస్ కాలువలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన సంస్థ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మణికుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విశాఖపట్నం–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం–చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం–చర్లపల్లి ప్రత్యేక రైలు (08579) ఈ నెల 16న సాయంత్రం 6.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (08580) ఈ నెల 17న ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, అదే రోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. రెండు మార్గాలలో ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడకుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లలో ఆగుతుంది.

పౌర్ణమి వేళ.. దుర్గమ్మ సన్నిధి కిటకిట

స్వర్ణకవచంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఫాల్గుణ పౌర్ణమి, శుక్రవారం, హోలీ సెలవు, వివాహ సుముహూర్తాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గమ్మ స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. శుక్రవారం ఒక్క రోజే సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి.

అంతరాలయ దర్శనం రద్దు...

శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి కనిపించింది. ఉదయం 10 గంటలకు ఘాట్‌రోడ్డులోని సమాచార కేంద్రం వరకు క్యూలైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. మరో వైపున మహా మండపం మీదుగా వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకే అనుమతించారు. 10 గంటల తర్వాత భక్తుల రద్దీ మరింత పెరగడంతో రూ.500 టికెట్ల విక్రయాలను నిలిపివేసి అంతరాలయ దర్శనం రద్దు చేశారు. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు 11–40 గంటల నుంచి 12–15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. ఆ తర్వాత కూడా అంతరాలయ దర్శనం రద్దు చేసి ముఖ మండప దర్శనం కల్పించారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. పౌర్ణమి, శుక్రవారం నేపథ్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన అన్ని ఆర్జిత సేవలకు డిమాండ్ కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద నిర్వహించే ఖడ్గమాలార్చనలో గతంలో ఎన్నడూ లేని విధంగా 41 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చన, చండీ హోమం, శాంతి కల్యాణంలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచ హారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై బాపులపాడు మండలంలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. మండలంలోని ఎ.సీతారామపురం వద్ద హైవేపై ముందు వెళుతున్న కంటైనర్ లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతి చెందింది. కారు డ్రైవర్ రవి అతి వేగంతో నిర్లక్ష్యంగా కారు నడపటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన పెద్దు పద్మావతి (72), ఆమె కుమారుడు వేణుమాధవ్, కోడలు తేజస్వినితో కలిసి కొవ్వూరులోని శ్రీరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి వెళ్లి, తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం కంటైనర్ లారీ కింద ఇరుక్కుపోవటంతో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న పద్మావతి తల భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న వీరవల్లి పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన పద్మావతి మృతదేహాన్ని వెలికి తీశారు. స్వల్ప గాయాలతో బయట పడ్డ డ్రైవర్ రవి, వేణుగోపాల్, తేజస్వినిలను చికిత్స నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. పద్మావతి మృతదేహానికి గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై వీరవల్లి ఎస్ఐ శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కారు ముందు సీటులో పద్మావతి మృతదేహం

హోసన్నా మందిరం వద్ద...

జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ శివారులోని హోసన్నా మందిర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శేరీనరసన్నపాలెంకు చెందిన బొల్లిగర్ల నాగేశ్వరరావు (42) దుర్మరణం చెందాడు. కాలినడకన వెళుతున్న నాగేశ్వరరావును వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాగావళిలో బాలుడి దుర్మరణం



సాయికృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగఢ: స్థానిక చెక్కాగుడ సమీపంలోని నాగావళి నదిలో మునిగి ఒక యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడు విజయవాడలోని పాడుమెట్టలో నివసిస్తున్న పి.మురళి కుమారుడు సాయికృష్ణ(16)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పి.మురళి కుటుంబంతో సహా మొత్తం 16 మంది మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి వచ్చారు. అనంతరం చెక్కాగుడలోని రోప్‌వే బ్రిడ్జిని సందర్శించేందుకు వెళ్లారు. రోప్ వే బ్రిడ్జి కింద పారుతున్న నాగావళి నదిలో సాయికృష్ణ స్నానానికి దిగాడు. ఈ సందర్భంగా నది మధ్యలోకి వెళ్లి ఫొటోలు తీసుకునే ప్రయత్నం చేశాడు. దీంతో నది తీవ్రతకు అదుపు తప్పి కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. ఇటువంటి తరహా ప్రమాదాలు తరచూ ఇక్కడ చోటు చేసుకుంటుండడంతో జిల్లా యంత్రాంగం రోప్ వే బ్రిడ్జిని నిషేధిస్తూ పర్యాటకులు వెళ్లకుండా ప్రవేశ ద్వారాన్ని ఇదివరకే మూసివేసింది. అయితే కొంతమంది పర్యాటకులు రోప్ వేని చూసేందుకు వెళ్లి ఇలా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జనాభా గణనలో మాల ఆది ఆంధ్రులకు అన్యాయం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ ఉప వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ప్రతిపాదించిన రెల్లి కులానికి ఒక శాతం, మాదిగ కులానికి ఆరున్నర శాతం, మాల కులానికి ఏడున్నర శాతం రిజర్వేషన్లను ఉప వర్గీకరించడానికి తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం నేతలు తెలిపారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నూతలపాటి జగదీష్ మాట్లాడుతూ 2024 ఆగస్టు ఒకటవ తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ ఉప వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చనే హక్కును తెలియజేస్తూ వాటికి నియమ నిబంధనలు విధించిందన్నారు. కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు గైడెన్సును పూర్తిగా పక్కకు పెట్టి, జనాభా దామాషా ప్రకారం ఉప వర్గీకరణ చేస్తామని ఒక వార్తను బయటకు విడుదల చేసిందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అయితే తప్పనిసరిగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని నిర్ధారించడానికి ఎస్సీల వాస్తవ గణాంకాలను సేకరించాలని, అందుకు ఉద్యోగాలు, సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యాపరమైన విషయాలను పరిగణనలోకి తీసుకుని వివిధ కులాల వెనుకబాటుతనాన్ని నిర్ధారించి అప్పుడు మాత్రమే ఉప వర్గీకరణ చేయాలన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి అంబటి అనిల్ కుమార్, అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవి ప్రసాద్, నాయకులు శ్యామ్ కుమార్, డాక్టర్ ముద్ద అంకయ్య, బేతాళ సుదర్శనం, సయ్యద్ భావన, పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పటిష్ట చర్యలు

- ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలు
- జిల్లాలో 22,341 మంది విద్యార్థులు హాజరు
- వీరి కోసం 145 పరీక్ష కేంద్రాలు
- డీఈవో పీవీజే రామారావు వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పదో తరగతి పరీక్షలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 145 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 22,341 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. వీరిలో 11,770 మంది బాలురు, 10,571 మంది బాలికలు ఉన్నారన్నారు. పరీక్షలకు ఈనెల 31వ తేదీ వరకు షెడ్యూలు ప్రకటించామని ఒకవేళ 31వ తేదీన రంజాన్ పర్వదినం వస్తే ఆ రోజు నిర్వహించాల్సిన పరీక్షను ఏప్రిల్ 1వ తేదీన నిర్వహిస్తామన్నారు. వీటికి సమాంతరంగా జిల్లాలో 22 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా జరుగుతాయని డీఈవో వివరించారు.

29 పోలీస్‌స్టేషన్లలో స్టోరేజ్ పాయింట్లు

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు డీఈవో తెలిపారు. విద్యార్థులు సబ్జెక్ట్ పరంగా క్షుణ్ణంగా ఒకటికి రెండు సార్లు చదువుకునేలా పరీక్షల మధ్య ఒకరోజు సమయం ఇచ్చామన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రశ్నపత్రాలు అందజేసేందుకు జిల్లా వ్యాప్తంగా 29 పోలీస్‌స్టేషన్లలో స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. స్టోరేజీ పాయింట్ల నుంచి పరీక్ష కేంద్రాలకు ఉదయం 9 గంటలకు ప్రశ్నపత్రాలు బందోబస్తుతో చేరుకుంటాయన్నారు. పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ, మునిసిపాలిటీ, ఆర్టీసీ అధికారులతో ఇటీవల కలెక్టర్ డీకే బాలాజీ సమీక్ష నిర్వహించి సూచనలు ఇచ్చారన్నారు. 52 పరీక్ష కేంద్రాలను సీ–కేటగిరీ కేంద్రాలుగా గుర్తించామని, వీటిలో 52 సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షణ చేస్తాయన్నారు. ఆరు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించి వాటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి

తల్లిదండ్రులు పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పోషకాహారంతో పాటు విరామం కూడా ఇవ్వాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు అనుమతించబడవన్నారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడామని, హాల్‌టికెట్ చూపిన వెంటనే సంబంధిత పరీక్ష కేంద్రానికి ఉచితంగా చేరవేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా అబ్జర్వర్‌గా కృష్ణమోహన్

పదో తరగతి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ పబ్లిక్ లైబ్రరీస్ కృష్ణమోహన్‌ను జిల్లా పరిశీలకులుగా నియమించినట్లు డీఈవో తెలిపారు. ఎటువంటి సంఘటనలు ఎదురైనా వెంటనే సమాచారం అందించేందుకు డీఈవో కార్యాలయంలో 24 గంటలు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. 98499 09106, 98482 32601 నంబర్లకు సమాచారం ఇస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు : ఇరువురు దుర్మరణం

యండకుదురు (ఘంటసాల): రొయ్య పిల్లలు తీసుకుని స్వగ్రామానికి బయలుదేరిన ఇరువురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు ఘంటసాల మండలం యండకుదురు గ్రామ శివారు జీలగలగండి వద్ద జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం ప్రాతాళ్ల మెరక గ్రామానికి చెందిన కోటే వెంకట వర ప్రసాద్ (59), కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన చీపురపల్లి శివకృష్ణ (30) కారులో ఒంగోలు వద్ద రొయ్య పిల్లలు కొనుక్కుని ప్రాతాళ్ల మెరక గ్రామానికి తిరుగు పయనమయ్యారు. అసాం నుంచి చీరాలకు సరుకు బాదులతో వస్తున్న లారీని ఘంటసాల మండలం యండకుదురు శివారు జీలగలగండి వద్ద జాతీయ రహదారిపై వీరి వ్యాన్ బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. వాహనంలో ఉన్న వెంకట వరప్రసాద్, శివకృష్ణ ఘటనా స్థలంలోనే మృతి చెందారు.

పోలీసులు, స్థానికుల చొరవతో మృతదేహాల వెలికితీత

రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకోగా కొద్దిసేపటికి చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు కూడా వచ్చారు. స్థానికుల సహకారంతో వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకున్న వర ప్రసాద్, శివకృష్ణ మృతదేహాలను స్థానికుల సహకారంతో బయటకు తీసి అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వెంకట వరప్రసాద్ భార్య నిర్మల కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘంటసాల ఎస్ఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జీలగలగండి వద్ద జాతీయ రహదారిపై లారీని ఢీకొన్న వ్యాన్